సాక్షి
ఒడిశా

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,34,528లు, బంగారం 5గ్రాముల 300 మిల్లీగ్రాము, వెండి 12గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

దొంగతనానికి వచ్చి.. యువతిపై గొడ్డలితో దాడి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎం.వి 79 పోలీస్ స్టేషన్ పరిధిలో నాలాగుంరి పంచాయతీ ఎం.వి 74 గ్రామంలో బుధవారం రాత్రి ఓ ఉపాధ్యాయుడి ఇంటికి దొంగతనానికి కొంతమంది దుండగులు వచ్చారు. అర్ధ రాత్రి సమయంలో దొంగలు పెరడ వైపు నుంచి పైకప్పును తొలగించి ఇంటిలోకి ప్రవేశించారు. శబ్దం కావడంతో మేలుకువ వచ్చి కేతు గోల్దార్ అనే ఉపాధ్యయుడి కుమార్తె ఖుసుభు కేకలు వేసింది. ఆ క్షణంలో వెంటనే ఆమె తలపై దొంగ తన చేతిలో ఉన్న గొడ్డలితో కొట్టి నోటిని నొక్కబోయాడు. ఆమె విడిపించుకొని కేకలు వేసింది. దీంతో దొంగలు అక్కడ నుంచి పారిపోయారు. ఖుసుభును వెంటనే తల్లిదండ్రులు కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. గురువారం ఉదయం ఎం.వి 79 పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ చంద్రకాంత్ తండి కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించి దొంగలను పట్టుకుంటామన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉపముఖ్యమంత్రి పర్యటనలు

భువనేశ్వర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా 5 రోజుల్లో 5 జిల్లాలను పర్యటించనున్నారు. శుక్రవారం నుంచి ఈ పర్యటన మొదలవుతుంది. ఈ సందర్భంగా కొరాపుట్, నవరంగ్‌పూర్, కలహండి, బొలంగీర్, సోన్‌పూర్ జిల్లాలను ఆమె 5 రోజుల పాటు సందర్శిస్తారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా కొటియా ప్రాంతంపై ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌పై కొటియా ప్రాంతీయుల ఆసక్తి మళ్లించే దిశలో ఇటీవల కాలంలో ప్రభుత్వం ఈ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. ఈ నేపథ్యంలో పర్యటనలో భాగంగా కొటియా ప్రాంతం ఉప ముఖ్యమంత్రి సుభద్ర యోజనతో పాటు కొటియా ప్రాంతంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షిస్తారు. దీనితో పాటు ఈ నెల 9న రాఖీ పూర్ణిమ సందర్భంగా కొరాపుట్‌లో నిర్వహించే సుభద్ర 3వ విడత పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరవుతారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన పురస్కరించుకుని 5 జిల్లాల్లోని స్త్రీ, శిశు అభివృద్ధి, మిషన్ శక్తి, పర్యాటక శాఖల వివిధ కార్యక్రమాలు, పథకాలను సమీక్షిస్తారు.

మలేరియాతో విద్యార్థిని మృతి



నచిక పింకి మృతదేహం

రాయగడ: సదరు సమితి మట్టి కొన గ్రామంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నచిక పింకి అనే విద్యార్థిని మలేరియాతో గురువారం మృతి చెందింది. వారం రోజుల క్రితం విద్యార్థినికి జ్వరం రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యింది. అనంతరం ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాను సేకరించిన వైద్యులు ఆమెకు మలేరియా సోకినట్లుగా గుర్తించారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న విద్యార్థిని పెద్ద అన్నయ్య ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న తన చెల్లెలను స్వగ్రామమైన జండిగి గ్రామానికి తీసుకెళ్లాడు. అయితే ఇంట్లో చికిత్స పొందుతున్న విద్యార్థిని నచిక పింకి తీవ్ర అస్వస్థతకు గురై గురువారం మృతి చెందింది.

బాధ్యతల స్వీకరణ



సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిషేక్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ కలెక్టర్‌గా దుధాల్ అభిషేక్ దిల్లిప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కిరణ్ దీప్ కౌర్ కటక్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అభిషేక్‌కు సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, ఉద్యోగులు, గుణుపూర్ ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

సుభద్ర పథకంపై అవగాహన



రామ్‌నగర్‌లో సుభద్ర పథకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక ఒకటో నంబర్ వార్డు రామ్‌నగర్‌లో గురువారం సుభద్ర పథకం మూడో విడత రాఖీ పూర్ణిమ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేస్తుండటంతో దీనిపై బీజేపీ యువజన నాయకులు కోట్ల యువరాజ్, పిన్నింటి క్రాంతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు మహిళల ఖాతాల్లో ఏడాదికి పది వేల రూపాయలు జమచేస్తూ ఇచ్చిన మాట నెరవేర్చిందని కోట్ల యువరాజ్ అన్నారు. ఈ నెల 9 తర్వాత 21 ఏళ్లు నిండిన మహిళలు కొత్తగా సుభద్ర పోర్టల్‌లో నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

డెంగీతో ఒకరి మృతి

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ గ్రామానికి చెందిన ఎ.సోమేశ్వరరావు(45) డెంగీతో మృతి చెందారు. కొద్ది రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న ఆయనను కల్యాణ సింగుపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డెంగీగా నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కొరాపుట్‌కు రిఫర్ చేశారు. ఆయన బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలియజేశారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా.. మాధురి దీక్షిత్



ఒడిశా చేనేత బ్రాండ్ అంబాసిడర్ మాధురి దీక్షిత్

చేనేత రంగంలో రాణిస్తున్న ఔత్సాహికులకు ముఖ్యమంత్రి సత్కారం



జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి ప్రసంగం

భువనేశ్వర్: బాలీవుడ్ అగ్రశ్రేణి వెండితెర నాయిక మాధురి దీక్షిత్ ఒడిశా చేనేతకు కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. స్థానిక జనతా మైదానంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత వస్త్ర మేళా ఏక్తా ప్రారంభోత్సవం పురస్కరించుకుని ముఖ్యమంత్రి ప్రసంగించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ గురువారం ఈ ప్రకటన చేశారు. మాధురి దీక్షిత్ వచ్చే ఏడాది పాటు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఒడిశా యొక్క శక్తివంతమైన చేనేత వారసత్వాన్ని ప్రాతినిధ్యం వహిస్తారు. 120 సంవత్సరాల క్రితం ప్రారంభమైన స్వదేశీ ఉద్యమానికి ప్రాణం పోస్తు నిరవధికంగా కృషి చేస్తున్న రాష్ట్ర చేనేత కార్మికులు జాతికి గర్వ కారణమని అభినందించారు. చేనేత ఒడియా గుర్తింపునకు ప్రతీక అని, పురాతన సముద్ర వాణిజ్యం నుంచి ప్రస్తుత ప్రపంచ ఫ్యాషన్ వేదిక వరకు రాష్ట్ర నేత సాంస్కృతిక వారసత్వ విలువల పరిరక్షణతో ఎల్లప్పుడూ శ్రేష్ఠత చాటుకుంటుందన్నారు. చేనేత రంగం అభివృద్ధి పథకాల ద్వారా చేనేత కార్మికుల సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరచడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. ఒడియా వారసత్వాన్ని సంరక్షించడం, ప్రోత్సహించే దిశలో ఇదో ముందడుగుగా అభివర్ణించారు. రాష్ట్ర చేనేత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు సాధించింది. అంచెలంచెలుగా ఈ ఉత్పాదనల పట్ల అంతర్జాతీయ స్థాయిలో గిరాకీ పుంజుకుంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. 2015 నుంచి 2025 మధ్య దేశ వ్యాప్తంగా రూ. 1.5 లక్షల కోట్ల విలువైన ఖాదీ మరియు చేనేత ఉత్పత్తులు అమ్ముడయ్యాయి. గత దశాబ్దంలో అమ్మకాలు 315 శాతం, ఉత్పత్తి 400 శాతం పెరిగాయి. ఒడిశా చేనేత రంగంలో 30 జిల్లాల్లో 1.3 లక్షలకు పైగా నేత కార్మికులు మరియు అనుబంధ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాన్స్, జపాన్, సంయుక్త రాష్ట్ర అమెరిరా, సింగపూర్ వంటి ప్రముఖ దేశాలలో ఒడిశా చేనేత ప్రత్యేక గుర్తింపుతో ఆకట్టుకుంటుంది. రాష్ట్ర నేత కార్మికులకు సముచిత గుర్తింపు ప్రదానం చేసేందుకు వారి కష్టానికి తగిన ఫల ప్రదానం చేసేందుకు చేనేత ఉత్పాదనలకు అమ్మకాలు పెంచడంలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం ఈ-కామర్స్ వంటి మార్కెటింగ్ మద్దతు వేదికలను కల్పిస్తుంది. ఈ రంగంలో యువతను ఆకర్షించి నిమగ్నం చేసేందుకు ఫెలోషిప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. చేనేత పరిశ్రమ సుస్థిర అభివృద్ధి కోసం రాష్ట్రంలో 6 టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర చేనేత ఉత్పాదనలపట్ల ఆదరణ పెంపొందించేందుకు పౌరులు కనీసం వారానికి ఒకసారి ఒడిశా చేనేత వస్త్రాలను ధరించి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించి స్వదేశీ విలువల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ రంగం బహుముఖ అభివృద్ధి కోసం ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, సంస్థాగత మద్దతును అందించడానికి సిద్ధంగా ఉంది. బర్‌గఢ్, కటక్‌లలో డై హౌస్‌లు, గిడ్డంగులు, డిజైన్ స్టూడియోలు, నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలు వంటి సాధారణ సౌకర్యాలతో కూడిన చేనేత పార్కుల అభివృద్ధి కొనసాగుతుంది. ఒడిశాకు చెందిన 40 మందికి పైగా మాస్టర్ వీవర్లకు ఎక్సలెన్స్, ఇన్నోవేషన్ కోసం జాతీయ అవార్డులు లభించడం గర్వకారణంగా కొనియాడారు.

1 నెల.. 3 మరణాలు



బాలిక మరణం నిజాలు వెలికి తీయాలని ఆందోళన

- అబలల వరుస మరణాలపై విపక్షాల మండిపాటు
- రాష్ట్రంలో ఘోర పరిస్థితులు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఒక నెలలో ముగ్గురు అమాయక ఆడపిల్లల మరణాలు రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చాయి. తాజా సంఘటనలో కేంద్రాపడా జిల్లాలోని పట్టాముండై మండలం పరిధి కొధియాపడా గ్రామానికి చెందిన చివరి సంవత్సరం ప్లస్ 3 (డిగ్రీ) విద్యార్థిని బుధవారం తన ఇంటిలోనే అగ్నికి ఆహుతైంది. ఈ విచారకర సంఘటనపై రాజకీయాలకు అతీతంగా దర్యాప్తు నిష్పక్షపాతంగా నిర్వహించాల్సి ఉంది. స్వల్ప వ్యవధిలో వరుసగా ఇది మూడో సంఘటన. కొన్ని వారాల క్రితం బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాలకు చెందిన ఒక విద్యార్థిని తనను తాను నిప్పంటించుకుని మృత్యు పోరాటం చేసి తుది శ్వాస విడిచింది. ఈ సంఘటనపై విచారణ కొనసాగుతుండగా మరి కొద్ది రోజుల వ్యవధిలో పూరీ జిల్లా నిమాపడా నియోజక వర్గం పిప్పిలి మండలం బయాబొరా గ్రామంలో బహిరంగ ప్రదేశంలో ఒక మైనర్ బాలిక మంటల్లో చిక్కుకుని ఆహుతైంది. ఆమెను విమానంలో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స సమయంలో ఆమె తుది శ్వాస విడిచింది. ఈ మూడు సంఘటనల్లో బాధితులు యువతులే కావడం గమనార్హం. రాష్ట్రంలో యువతులు సామాజిక, మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న పరిస్థితులు ప్రత్యక్షంగా తారసపడుతున్నాయి. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పలు రకాల ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో మానసిక బలహీనతలకు గురై ప్రాణాలు తీసుకుంటున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ కేసుల విషయంలో విచారణ, దర్యాప్తు రంగాల్లో పారదర్శకత ప్రశ్నార్థకంగా మారుతోంది. నిమాపడా ప్రాంతపు బాలిక మరణం విషయంలో బాలిక మరణించిన మరు క్షణమే ఆమె మరణానికి ఎవరూ బాధ్యులు కారని దర్యాప్తు వర్గం బహిరంగంగా ప్రకటించింది. దర్యాప్తు విచారణ దశలో ఉండగా ఇటువంటి అభిప్రాయాన్ని వ్యక్తీకరించడం చట్టపరంగా పలు ప్రశ్నల్ని ప్రేరేపించింది. ఈ విచారకర సంఘటనల పూర్వాపరాలు ఆధారంగా ప్రభుత్వ యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టకుంటే ఈ సంఘటనల పునరావృతం విస్మరించలేని పరిస్థితులు కలవరపరుస్తున్నాయి. ఈ 3 విచారకర సంఘటనల్లో ఒకే విధమైన పరిస్థితులు కనిపించాయి. ఈ పరిస్థితుల నివారణకు మానసిక ఆరోగ్య అవగాహన, డిజిటల్ భద్రత, సమాజ ఆధారిత జోక్యాలకు ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని అధ్యయన రీతిలో దర్యాప్తు విజయవంతమైతే సురక్షిత సమాజంలో యువతులు ఉజ్వల భవిష్యత్‌కు మార్గ నిర్దేశకం అవుతుంది. తరచూ సంభవిస్తున్న ఆత్మాహుతి వంటి సంఘటనల్లో బాలికలు, యువతుల భవిష్యత్తు క్రూరంగా ఆహుతైంది. ఈ నమూనా పునరావృతం కాకుండా సత్వర కార్యాచరణ ఆవిష్కరణ అనివార్యంగా అనుబంధ వర్గాలు గుర్తించి ముందుకు సాగాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

కట్టుకున్నవాడే కడతేర్చాడు




సింధే మృతదేహం

రాయగడ: సదరు సమితి శిఖాల్ పోలీస్‌స్టేషన్ పరిధి గెండావలస గ్రామంలో భార్యను భర్త హత్య చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గెండావలస గ్రామంలో సింధే కొండగిరి, బాలయ్య కొండగిరి అనే భార్యభర్తులు నివసిస్తున్నారు. అయితే ఇద్దరి మధ్య గత కొన్నేళ్లుగా చిన్న, చిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వారి ఇద్దరు పిల్లలు గురువారం పనులకు వెళ్లిపోవడంతో ఇదే అదనుగా భావించిన బాలయ్య తప్పతాగి తన భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. కోపోద్రేక్తుడైన భర్త పక్కనే ఉన్న కర్రతో తన భార్య సింధే(43)పై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన ఆమె మృతి చెందింది. వెంటనే బాలయ్య అక్కడ నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న వారి కొడుకులు ఇంటికి వెళ్లిచూడగా రక్తపు మడుగు తల్లి మృతదేహం పడిఉంది. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర మాజీ డిప్యూటీ స్పీకర్ మృతి





శాసన సభ ఆవరణలో దివంగత బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ వీడ్కోలు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ మాజీ డిప్యూటీ స్పీకర్, ఖండపడ రాజా, మంత్రి, బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్ (70) మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన మృతిపై రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితర రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసన సభకు 3 సార్లు ఎన్నికై డిప్యూటీ స్పీకర్ వంటి ప్రతిష్ఠాత్మక పదవిని అలంకరించి మంత్రిగా రాష్ట్రానికి విశిష్టత, గౌరవంతో కూడిన సేవ చేశారు.

దివంగత బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్ ఖండపడ రాజ వంశీకుడు. రాష్ట్ర శాసన సభకు వరుసగా 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక అయ్యారు. 1980, 1985, 1995లో ఖండపడా నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. పర్యాటక, సంస్కృతి, ప్రణాళిక – సమన్వయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1996 నుండి 2000 వరకు రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా విజయవంతంగా బాధ్యతలు నిర్వహించారు.

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ బిభూతి భూషణ్ సింగ్ మార్దరాజ్ పార్థివ దేహం దగ్గర స్పీకర్ సురమా పాఢి గురువారం నివాళులు అర్పించారు. శాసన సభ ప్రాంగణంలో ప్రభుత్వ లాంచనాలతో దివంగత నాయకునికి తుది వీడ్కోలు పలికారు.



నివాళులర్పించిన రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢి

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్ అశ్ని

మల్కన్‌గిరి: జిల్లా సబ్ కలెక్టర్‌గా అశ్ని ఏఎల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇదివరకు మయూర్‌బంజ్ జిల్లాలో శిక్షణ పొంది, మొదటి పోస్టింగ్‌లో భాగంగా ఇక్కడికి వచ్చారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఆమె స్వస్థలం కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రం.

కెనాల్‌లో మృతదేహం లభ్యం



నీటిలో తేలుతున్న సమీర్ మృతదేహం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి సమితి ఎంపీవీ 12 గ్రామం వద్ద గురువారం ఓ మృతదేహం దొరికింది. అది చూసిన స్థానికులు మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసి రీగాన్‌కీండో తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి ఎంపీవీ 17 గ్రామానికి చెందిన సమీర్ దాస్ (24)గా గుర్తించారు. మందపల్లి పంచాయతీకి బియ్యం తీసుకురావడం కోసం బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి కాలువలో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహన్ని పోలీసులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గర్భం దాల్చిన విద్యార్థిని

జయపురం: స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని గర్భం దాల్చింది. దీనిపై హాస్టల్ విద్యార్థులు జయపురం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళా పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఆమె జూన్‌లో ఊరు వెళ్లినప్పుడు గతంలో ఆమెకు పరిచయం ఉన్న ఓ విద్యార్థి ఆమె ఇంటికి వెళ్లాడని, పెళ్లి చేసుకుంటానని చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడిని కోర్టులో ప్రవేశపెట్టామని బెయిల్ రాకపోవడంతో జైలుకు పంపినట్లు వెల్లడించారు. బాధితురాలిని శిశు సంక్షేమ విభాగ అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి



ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: రాష్ట్రంలో శాంతి భద్రతలకు పూర్తిగా విఘాతం ఏర్పడిందని, మహిళలకు రక్షణ కరువయ్యిందని దీనికి నైతిక బాధ్యతగా రాష్ట్ర ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బిజు ఛత్రో జనతాదళ్ కార్యకర్తలు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు డీజీపీ పేరిట ఒక వినతిపత్రాన్ని ఎస్పీ కార్యాలయానికి చేరుకొని ఐఐసీ ప్రసన్న కుమార్ బెహరకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, విద్యార్థినులపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఛత్రో జనతాదళ్‌కు చెందిన ప్రవీణ్ కుమార్, ఉదయ్ హిమిరిక, బినోద్ పాల్లాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఐఐసీ ప్రసన్న కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బాలికల హాస్టల్‌లో విష సర్పాలు





మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి కేంద్రంలో ఉన్న ఎస్ఎస్‌డీ బాలికల పాఠశాల హాస్టల్‌లోకి బుధవారం రాత్రి రెండు విష సర్పాలు వచ్చాయి. వాటిని చూసి పిల్లలు కేకలు వేయడంతో ఉపాధ్యాయురాలు స్నేహశ్రీ ఓర్పుగా రెండు పాములను పట్టుకున్నారు. మల్కన్‌గిరి

క్లుప్తంగా

దేహదారుఢ్యంపై అవగాహనకు పాదయాత్ర



జాతీయ జెండాతో అభిరామ్ సత్‌పతి

ఇచ్ఛాపురం: దేహదారుఢ్యానికి ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని అవగాహన కల్పిస్తూ ఒడిశా రాష్ట్రం కటక్ జిల్లాలోని ఝూర్సిగూడ దుర్లఘ గ్రామానికి చెందిన అభిరామ్ సత్‌పతి అనే 68 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి దేశవ్యాప్తంగా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. 2023 మే 25న పాదయాత్ర ప్రారంభించి గురువారం ఇచ్ఛాపురం చేరుకున్నారు. మొత్తం 16,100 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయనున్నట్లు అభిరామ్ పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో రాజేంద్రప్రసాద్ చౌదరి మృతదేహం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బౌద్ధ జిల్లా బౌద్ మున్సిపాలిటీకి చెందిన రాజేంద్రప్రసాద్ చౌదరి(69) శనివారం తన జీపులో కాశీనగర్ సమీపంలోని కొల్లహరిపురం వద్ద పొలాలను చూడటానికి వెళ్లాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా.. బెల్లుపడ పాత టోల్‌ప్లాజా సమీపంలో రాంగ్‌రూట్‌లో నిర్లక్ష్యంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో జీప్ నడుపుతున్న హరిప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. హరిప్రసాద్ కుమారుడు చిన్నయ్య చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై చక్రధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎల్‌ఐపీ కొనసాగించాలని వినతి

ఎచ్చెర్ల : డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ కింద కమ్యూనిటీ సర్వీసెస్ కార్యక్రమాన్ని కూడా భాగం చేయాలని సంబంధిత అధికారులు గురువారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజనీ, రిజిస్ట్రార్ పి.సుజాతలను గురువారం విజ్ఞప్తి చేశారు. యూనివర్శిటీ పరిధిలో గత ఏడాది 25 డిగ్రీ కాలేజీల్లో 'ప్రేరణమిత్ర' యాప్ ద్వారా లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(ఎల్‌ఐపీ) విజయవంతంగా అమలయ్యిందని, ఈ విద్యా సంవత్సరంలోనూ దీనిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్శిటీ బోర్డు ఫర్ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ బి.అజయకుమార్, శిక్షణా ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవోద్యమంలో త్యాగాలు అనివార్యం



సురేఖ పాణిగ్రాహి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: విప్లవోద్యమంలో ప్రాణత్యాగాలు అనివార్యమని, అందుకు అనేక కుటుంబాలు ఎన్నో కష్టాలను మౌనంగా భరించాయని, అలాంటి వారిలో సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి ఒకరని పలువురు వక్తలు కొనియాడారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద గురువారం సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ సంతాప సభ నిర్వహించారు. అమరుల బంధుమిత్రుల కమిటీ నాయకుడు తామాడ త్రిలోచనరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సి.పి.ఐ.ఎం.ఎల్ లిబరేషన్ సీనియర్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు, విరసం రాష్ట్ర నాయకుడు అరసవెల్లి కృష్ణ, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాసంఘాల నాయకులు తామాడ అరుణ, పోతనపల్లి అరుణ, పోతనపల్లి కుసుమ, మద్దిల రామారావు, జోగి కోదండరావు, వంకల మాధవరావు, నిరంజన్ పాణిగ్రాహి, చింతాడ కృష్ణారావు, కోనేరు రమేష్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

జయపురం: ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరపాలని బొరిగుమ్మలో గురువారం జరిగిన స్వాతంత్ర్య సన్నాహక సమావేశం నిర్ణయించింది. బొరిగుమ్మ బీడీఓ కార్యాలయ సభాగృహంలో జరిగిన సమావేశంలో బీడీఓ సుకాంత పట్నాయక్ కార్యక్రమంపై సభికులకు వివరించారు. ఉదయం 9 గంటలకు బొరిగుమ్మ హైస్కూల్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా బొరిగుమ్మ సమితిలో గల అన్ని పాఠశాలల్లో 21 ఏళ్ల వయసు లోపు విద్యార్థులకు సంస్కృతిక నృత్య ప్రదర్శన, సంగీతం, చిత్ర లేఖనం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నృత్య పోటీల్లో ఉత్తమ రెండు గ్రూపుల మధ్య పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉత్సాహంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

తల్లిపాలు అమృతం



సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సెంచూరియన్ వర్సిటీ వైద్య నిపుణులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నర్సింగ్ విద్యార్థినులు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించారు. గుసాని సమితిలో మచ్చుమర, యువరాజ్ పూర్, భిన్నల, పుద్దుని, బాగుసల, కత్తలకవిటి గ్రామాల్లో తల్లిపాలు సేవనంపై అవగాహన కల్పించారు ఆగస్టు 1 నుంచి 7 వరకు ఉత్సవాలు నిర్వహించారు. తల్లిపాలపై పలువురికి ఉన్న అపోహలు తొలగిస్తూ నాటికలు, పోస్టర్లు ప్రదర్శించాశారు. గ్రామాల్లో 198 మందికి కంటి పరీక్షలు చేపట్టి.. 131 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్.సంధ్య, టి.సునీత, రష్మి జెన్నా, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ స్వాతి కిరణ్ పాల్గొన్నారు.



పూరీ ప్రాంతంలో బిజూ జనతా దళ్ హర్తాల్

నిజం నిగ్గు తేలాల్సిందే: బీజేడీ



నిమాపడా ప్రాంతంలో దిష్టి బొమ్మల దగ్ధంతో నిరసన ప్రదర్శన

భువనేశ్వర్: పూరీ జిల్లా నిమాపడా నియోజ వర్గం బొలొంగా ఠాణా పరిధిలో బయాబొరొ గ్రామంలో బాలిక మరణం వెనుక వెనుక నిజం నిగ్గు తేల్చాలని బిజూ జనతా దళ్ గట్టిగా పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో గురువారం పూరీ జిల్లాలో 6 గంటల పాటు నిరవధిక హర్తాల్ నిర్వహించారు. దీని ప్రభావం పూరీ, సాక్షి గోపాల్, పిప్పిలి మరియు నిమాపడా ప్రాంతాల్లో కనిపించింది.

నిందితునికి ఏడాది జైలు శిక్ష

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి పర్శాలి ఆశ్రమ పాఠశాలలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తు జిల్లా అదనపు జడ్జి వర్షా దాస్ తీర్పునిచ్చారు. ఐదు వేల రూపాయల జరిమానను చెల్లించాలని పేర్కొన్నారు. జూన్ 1వ తేదీన సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో కల్యాణసింగుపూర్ సమితి పర్శాలి ఆశ్రమ పాఠశాలలో బాలికల హాస్టల్ భవనంలో తాళాలు విరగ్గొట్టి టీవీ, కొన్ని వస్తువులు దొంగతనం జరిగాయి. ఈ కేసుకు సంబంధించి పోలీసులు నిందితుడు సంతోష్ టకిరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ నేపథ్యంలో విచారించిన జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి




మృతదేహం లభ్యమైన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామారావు, (ఇన్‌సెట్లో) నల్లి రాజా (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ హరిజన వీధి సమీపంలోని మహేంద్రతనయా నదికి వెళ్లే దారిలో మొండిగలవీధికి చెందిన నల్లి రాజా (34) అలియాస్ రాజు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున మృతదేహం వెలుగుచూడటంతో పాతపట్నంలో కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజా చిన్న చిన్న రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తుండేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పది గంటల సమయంలో బయటకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో నది వద్ద విగతజీవిగా మారడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే కుటుంబ సభ్యులు రాజాను పాతపట్నం సీహెచ్‌సీకి ఆటోలో తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పాతపట్నం సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య, మెళియాపుట్టి ఎస్ఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీకాకుళం క్లూస్ టీం బృందం, టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావులు పాతపట్నం చేరుకుని ఆరా తీశారు. మూడు బృందాలుగా విడిపోయి సీసీ పుటేజ్, సెల్‌ఫోన్ కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. రాజాకు భార్య మౌనిక, పిల్లలు ధనుష్, సాత్విక్ ఉన్నారు. మౌనిక ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లావణ్య తెలిపారు.

డిపోను విభజిస్తే సహించేది లేదు



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న హమాలీలు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విభజన చేపట్టి టెక్కలిలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఎచ్చెర్ల బేవరేజ్ కార్పొరేషన్ వద్ద చేపడుతున్న ధర్నా కార్యక్రమంలో భాగంగా గురువారం ఖాళీ ప్లేట్లతో హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ పేదల భూములు తీసుకుని పరిహారంగా ఉపాధిని కల్పించి ఇప్పుడు ఆయా కుటుంబాలు ఉపాధి కోల్పోయేలా ఉత్తర్వులు జారీచేయడం అన్యాయమన్నారు. అవసరం లేకున్నా డిపోను విడదీసి పొట్టలు కొట్టవద్దన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు దళితులకు అన్యాయం చేయడం తగదన్నారు. నిరసన కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు డి.బంగారాజు, టి.రామారావు, ఎం.సురేష్, ఎస్.రమణ, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, రాజు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పర్యాటక స్థలాలపై ప్రత్యేక బ్రోచర్



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఇన్‌టాక్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తిచేసుకుని వజ్రోత్సవాలు నిర్వహించుకుంటున్న సందర్భంగా జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భౌగోళిక ప్రాధాన్యత కలిగిన ప్రధాన ఆకర్షణీయ ప్రదేశాల వివరాలతో రూపొందించిన ప్రత్యేక బ్రోచర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ గురువారం ఆవిష్కరించారు. ఇంటాక్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ బ్రోచర్‌లో జిల్లా విశిష్టతను ప్రతిబింబించే ఆలయాలు, కోటలు, తీర్థక్షేత్రాలు, ప్రకృతి అందాలు, ఆదివాసీ ప్రాంతాలు, సాంస్కృతిక కేంద్రాల విశేషాలు పొందుపరిచారు. ఈ సందర్భంగా ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, కో–కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ 'దర్శించండి, ఆనందించండి, తరించండి' అనే నినాదంతో ఈ బ్రోచర్‌ను ప్రజల ముందుకు తెచ్చామని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, సీపీఓ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాద బీమా.. ఆరోగ్యానికి ధీమా



- ఉద్యోగులకు వరంలా ఎస్‌బీఐ శాలరీ అకౌంట్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

మీకు తెలుసా

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనేక ప్రయోజనాలను చేకూర్చే శాలరీ అకౌంట్(జీతం ఖాతా)ను అందుబాటులోనికి తీసుకొచ్చింది. ఇతర బ్యాంకుల్లో శాలరీ అకౌంట్‌లో ఉన్నవారు, ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్‌ను తెరుచుకున్నా ఇప్పటికే ఎస్‌బీఐలో అకౌంట్లో ఉన్న ఉద్యోగులు ఆ ఖాతాను స్టేట్ గవర్నమెంట్ శాలరీ అకౌంట్కు మార్చుకున్నా అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. మినిమం బాలెన్స్ నిర్వహించక్కర్లేదు. ప్రమాదంలో మరణిస్తే కోటి రూపాయల బీమా అందజేస్తారు. ప్రమాదంలో పూర్తి అంగవైకల్యం పొందితే కోటి రూపాయలు, పాక్షికంగా అంగవైకల్యం పొందితే 20 లక్షలు బీమాగా ఇస్తారు. గ్రూప్ టర్మ్ ఇన్సూరెన్సా పది లక్షల రూపాయలు అందజేస్తారు. ఆరోగ్యబీమాను కూడా ఈ అకౌంట్ ద్వారా అందిస్తారు. నగదు బదిలీ, డీడీలకు బ్యాంకు చార్జీలు తీసుకోరు. ఏటీఎం లావాదేవీలు అపరిమితం. ఆన్‌లైన్ కొనుగోళ్లకు రాయితీలు పొందే అవకాశం ఉంటుంది. ఈ అకౌంట్ కోసం పూర్తి వివరాలకు సమీపంలోని ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్లను సంప్రదించవచ్చు. మార్చి నుంచే ఈ ఖాతాను అమలు చేస్తుండగా ఉద్యోగస్తులకు అవగాహన లేకపోవడంతో ఇప్పటివరకు 25 శాతం మంది మాత్రమే వినియోగించుకున్నట్లు జిల్లాలోని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి.

దారి తప్పుతున్న ఎరువులు!

- ఆమదాలవలసలో రైల్వే అధికారులతో వ్యాపారుల కుమ్మక్కు
- రైతు భరోసా కేంద్రాల పేరుతో పక్కదారి
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు



ఆమదాలవలస రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్ వద్ద క్యూకట్టిన లారీలు

ఆమదాలవలస రూరల్: కొందరు వ్యవసాయాధికారులు, రైల్వే అధికారులు, వ్యాపారులు కుమ్మక్కు కావడంతో అన్నదాతలకు అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తుండటంతో రైతులకు సక్రమంగా ఎరువులు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు ఆమదాలవలసలోని రైల్వే గూడ్స్‌షెడ్ గోదాములు వేదికగా నిలుస్తున్నాయి. కొందరు వ్యవసాయాధికారుల అండగా.. ఎరువులు కంపెనీ అధికార, సిబ్బందితో కొందరు అక్రమ వ్యాపారులు చేతులు కలిపి ఎరువులను దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తరలింపులోనే తతంగమంతా..

ఆమదాలవలస రైల్వేవ్యాగన్‌కు వచ్చిన ఎరువులను తరలించే సమయంలో పలు అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా రైల్వే ప్లాట్‌ఫారంపై వచ్చిన ఎటువంటి వ్యాగన్ అయిన పెట్టెలను బట్టి సుమారు 5 గంటల నుంచి 8 గంటలలో ఖాళీచేయాలనేది రైల్వే నిబంధన. అయితే వ్యాగన్ వచ్చిన సమయం ఖాళీచేసిన సమయం రైల్వేస్టేషన్ అధికారులు నిర్ధారించాల్సి ఉంటుంది. అయితే రైల్వే అధికారులు మాత్రం ఎరువులు కంపెనీ యజమానులతో కుమ్మక్కై అయ్యి ప్లాట్‌ఫారం ఖాళీ లేదని చెప్పి, ఎటువంటి అపరాధ రుసుము కూడా వేయకుండా లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం రావాల్సిన వ్యాగన్‌ను సాయంత్రం ఆరు గంటలకు తెప్పించారు. కూలీలు లేరనే సాకుతో గురువారం వేకువజామున ఖాళీ చేయించారు. ఈ సమయంలోనే అక్రమాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.

అంతా గూడ్స్‌గోదాం నుంచే..!

అక్రమ ఎరువులు తరలింపు అంతా రైల్వేగూడ్స్‌షెడ్ గోదాం నుంచే జరుగుతోందనేది బహిరంగ రహస్యం. వివిధ కంపెనీల అధికారులతో వ్యాపారులు ఒప్పందం కుదుర్చుకొని అక్రమ తరలింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవంగా రైల్వే ప్లాట్‌ఫాం వద్ద అక్రమ ఎరువులు తరలింపు అవకాశం అంతంతమాత్రమే ఉండగా.. గోదాం నుంచి ఎక్కువ శాతం అక్రమంగా తరలించేఅవకాశం ఉంటుంది. గోదాం నుంచి రాత్రిపూట ఈ తరలింపులు జరుగుతాయనే వాదనలు ఉన్నాయి. అంతా కలసికట్టుగానే ఈ వ్యవహారం సాగిస్తున్నారనేది స్థానికుల మాట.



రైల్వే ప్లాట్‌ఫారం వద్దకు చేరుకున్న లారీలు

ఆ విషయం తెలియదు..

సకాలంలో రైలు వ్యాగన్ రాకుండా ఎరువులను పక్కదారి పట్టించటంలో పలువురు అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారనే విషయమై శ్రీకాకుళం గూడ్స్‌షెడ్(ఆమదాలవలస) సూపర్ వైజర్ శివశంకర్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా రైల్వే గూడ్స్ వ్యాగన్ ఏ సమయానికి వస్తోందో ఏ సమయానికి పోతుందో అన్న విషయం తనకు తెలియదని చెప్పారు. ఆ విషయం రైల్వే స్టేషన్ అధికారులకే తెలుస్తుందని సమాధానం దాటవేశారు.

మూల్యాంకన భారం!

- ఉపాధ్యాయులపై మరో బోధనేతర కార్యక్రమం
- పరీక్షల సంస్కరణ పేరిట మూల్యాంకన పుస్తకాలు జారీ
- సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో పరిస్థితి దారుణం



మూల్యాంకన పుస్తకాలు

నరసన్నపేట:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించిన మూల్యాంకన పుస్తకాల పట్ల ఉపాధ్యాయవర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇస్తున్న పనులను చేయడానికి అధిక సమయం వెచ్చించాల్సి వస్తోందని, తరగతుల బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నామని, ఇప్పుడు మూల్యాంకన పుస్తకాల భారం విధించడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల సంస్కరణలు పేరిట ప్రతి విద్యార్థికి ప్రతీ సబ్జెక్టుకు ఒక్కో మూల్యాంకనం పంపిణీ చేసిందని, దీని నిర్వహణ తలకు మించిన భారమవుతుందని అంటున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఒక్కో విద్యార్థికీ ఆరు చొప్పున మూల్యాంకన పుస్తకాలు పంపిణీ చేస్తుండగా ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను ఈ పుస్తకాల్లోనే విద్యార్థులతో రాయించాలి. రిమార్క్‌లు రాయాలి. అలాగే మూల్యాంకన పుస్తకంపై విద్యార్థులకు అవగాహన కలిగించాలి. మరో పక్క మూడో పేజీలో విద్యార్థుల వివరాలు, అపార్ ఐడీ, పెన్ ఐడీలు నింపాలి. పరీక్ష రాసిన తరువాత వాటిని దిద్ది అందులోనే ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌లో మార్కులు వేయడంతో పాటు ఈ పేజీని స్కాన్ చేసి విద్యా శాఖ ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

సమయమేదీ?

ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా కోట్లు వెచ్చించి ముద్రించి పాఠశాలలకు పంపిణీ చేసిన మూల్యాంకనాలు విద్యార్థులకు ఏ మేరకు ప్రయోజనం కలిగిస్తాయో తెలీదు గాని ఉపాధ్యాయులపై మాత్రం పని భారం తప్పడం లేదు. మూల్యాంకనాలు నింపేందుకు, విద్యార్థులు రాసిన పేపరు దిద్దేందుకు అంత సమయం ఎక్కడుందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడు నాలుగైదు తరగతులకు వెళ్తే ఆయా విద్యార్థుల మూల్యాంకణాలు సరి చేసేందుకు రోజుల సమయం పడుతుంది. ఇక పాఠాలు బోధన ఎప్పుడు చేస్తారని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల సింగిల్ టీచర్లు ఉన్నారు. వీరి పరిస్థితి మరింత దారుణం. ప్రాథమిక దశలో ప్రతి విద్యార్థికీ మూడేసి మూల్యాంకనాలు సరఫరా చేశారు. ఇవన్నీ ఒక టీచర్ ఎప్పుడు దిద్దుతారు.. ఎప్పుడు అప్‌లోడ్ చేస్తారు.. విద్యార్థులకు తరగతుల బోధన ఎప్పుడు చేస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

ఆలోచించరా..?



పరీక్షల నిర్వహణలో సంస్కరణలు మంచివే. అయితే వాటిని అమలు చేసేటప్పుడు సాధ్యాసాధ్యాలపై ఆలోచించాలి. నిపుణులతో చర్చించాలి. అలాకాకుండా ఏకపక్షంగా రుద్దితే అయ్యే పనికాదు. ఒక వైపు బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులను ఊపిరి సలపనివ్వడం లేదు. ఇంకో పక్క టీచర్ హేండ్ బుక్స్.. ఇప్పుడు మూల్యాంకణ పుస్తకాలు. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– బమ్మిడి శ్రీరామమూర్తి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అంతా గందరగోళం..



కొత్త పుస్తకాలు, పరీక్షల్లో మార్పులు ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారుతున్నాయి. ఒకటో తరగతి నుంచి తొమ్మితో తరగతి వరకూ ఒక ప్యాట్రిన్, పదో తరగతికి మరో ప్యాట్రిన్ అసెస్‌మెంట్ పుస్తకాలు గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఓఎంఆర్ షీట్‌ను అప్‌లోడ్ చేయాలనడం, దిద్దిన ప్రతి ప్రశ్నకూ స్కోరింగ్ ఇవ్వడం, ఎందుకు ఇచ్చారో వివరణ ఇవ్వడం పని భారం పెంచుతుంది.

– తమ్మినేని చందనరావు, ఏపీఎస్టీప రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బోధనకు సమయమేదీ?



సంస్కరణల పేరిట విద్యార్థులకు మేలు జరగాలే గానీ కీడు జరగకూడదు. ఈ మూల్యాంకన విధానంతో ఉపాధ్యాయులపై అదనపు భారం తప్ప ప్రయోజనం తక్కువ. దీనికితోడు బోధనా కాలం హరిస్తుంది. ఈ ప్రభావం ముున్ముందు విద్యా ప్రమాణాలపై తీవ్రంగా పడుతుంది.

– బి.వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెంపడాం విద్యార్థులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 3 వతేదీన విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ఎంపికలలో పాఠశాలకు చెందిన పి.వెంకటలక్ష్మి (లాంగ్‌జంప్), వి.కల్యాణి (హై జంప్), పి.శ్రీను (100 మీటర్లు, 200 మీటర్లు రన్నింగ్)లు ఎంపికయ్యారు. దీంతో ఈనెల 9,10 తేదీలలో రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లా చీరాలలో జరగబోయే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల హెచ్ఎం పి.లచ్చన్న, పీడీ గణేష్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

జాతీయ పోటీల్లో దివ్యాంగ విజేతకు అభినందనలు



దివ్యాంగ విజేతను అభినందిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు

విజయనగరం అర్బన్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో మేధోవైకల్యం గల ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ గేమ్స్ బేస్‌బాల్‌లో కాంస్యపతక విజేత అయిన తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తోషినిని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు అభినందించారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని వారి కార్యాలయాలకు వచ్చి అధికారులను తోషిని కలిసింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సాధారణ విద్యార్థుల మాదిరిగానే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు కూడా ప్రతిభ చూపడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. అనంతరం విజేతను, కోచ్‌లుగా వ్యవహరించిన పి.సునీల్, ఎస్.బంగారునాయుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు, సహ సమన్వయకర్త ఎం.భారతి, తెర్లాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఎం రమేష్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటుతుపాకీతో ఇద్దరి అరెస్ట్



అరెస్ట్ చేసిన వ్యక్తులతో సీఐ అప్పలనాయుడు, ఎస్సై సుదర్శన్ సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో నాటుతుపాకీ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేయడంతో నాటుతుపాకీ పట్టుబడినట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. సోంపురం గ్రామానికి చెందిన గొర్లె ఈశ్వర్రావు ఇంటిలో తనిఖీలు నిర్వహించగా నాటుతుపాకీ పట్టుబడినట్లు చెప్పారు. తుపాకీపై ఆరాతీయడంతో గుడివాడ గ్రామానికి చెందిన రొంగలి బంగారయ్య వద్ద రూ.4500కు కొనుగోలు చేసినట్లు ఈశ్వర్రావు తెలిపాడని చెప్పారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులులేకుండా తుపాకీ కలిగి ఉన్నందున ఈశ్వర్రావును, నాటు తుపాకీ అమ్మడం చట్ట రీత్యా నేరమైనందున విక్రయించిన బంగారయ్యను ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆర్టీసీ డార్మిటరీలో వ్యక్తి మృతి



ఆర్టీసీ డార్మిటరీలో మృతి చెందిన కృష్ణమూర్తి

విజయనగరం క్రైమ్: విజయనగరం ఆర్టీసీ డార్మిటరీలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై వన్ టౌన్ పోలీసులకు గురువారం అందిన ఫిర్యాదు మేరకు స్టేషన్ హెచ్‌సీ ఆవాల రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశాఖ జిల్లా తగరపు వలసకు చెందిన సబ్బిశెట్టి కృష్ణమూర్తి(54) శశికాలేజీలో కుక్‌గా పని చేస్తున్నాడు. మందుల కోసం విజయనగరం వచ్చి రాత్రి కావడంతో ఆర్టీసీ డార్మిటరీలో రూమ్ తీసుకుని ఉండిపోయాడు. నిద్ర సమయంలోనే గుండె పోటు రావడంతో మృతి చెంది ఉండవచ్చని మృతుడి అల్లుడు మక్కడపల్లి శ్రీనివాస్ చేసిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అడవితల్లి ఒడిలో ప్రశాంత జీవనం

- చూడముచ్చటగా కట్టుబొట్టు, ఆచారాలు
- కొండపోడే ఆధారంగా జీవనం
- మౌలికవసతులు అంతంతమాత్రమే
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రేపు



గిరిజన సంప్రదాయ వెదురు కూరను వంటకు సిద్ధం చేస్తున్న వృద్ధురాలు



ఐటీడీఏలో ఆదివాసీ తల్లి విగ్రహం



నృత్యాలు చేస్తున్న ఆదిమ గిరిజనులు (ఫైల్)



పండగలో ఆదివాసీ దేవతలకు పూజలు చేస్తున్న గిరిజనులు



రేషన్ మోసుకుంటూ ఇంటికి తీసుకు వెళ్తున్న మహిళలు

సీతంపేట: నవ్యసమాజానికి దూరంగా కొండకోనల్లో జీవనం సాగించే వారే గిరిపుత్రులు. కొండకోనల్లో ప్రత్యేక భాష, సంస్కృతి, సంప్రదాయాల నడుమ ఆదివాసీల జీవనం వైవిధ్యంగా సాగుతోంది. కాయకష్టం చేసి జీవించడం వారి జీవన విధానం. భిన్నమైన సంస్కృతి, సంప్రదాయాలు గిరిజనుల సొంతం. కొండల్లో తమ సంప్రదాయ వ్యవసాయాన్ని చేసుకుంటూ జీవిస్తున్న గిరిజనుల ఆచార వ్యవహారాలు, కట్టుబొట్టుల్లో మార్పులేదు. అటవీఉత్పత్తుల సేకరణ, పోడుపంటలు, వ్యవసాయ పంటల దిగుబడులు వచ్చినప్పుడు గిరిజనులు ప్రత్యేక పండగలు జరుపుకోవడం ఆనవాయితీ.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణ ఎందుకంటే..

ఆదివాసీల జీవన స్థితిగతులను ప్రపంచానికి తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి 1194 ఆగస్టు 9న జెనీవాలో ప్రపంచ ఆదివాసీ వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ వర్కింగ్ గ్రూప్ ఆదివాసీలపై అధ్యయనం చేసి ప్రపంచ దేశాల్లో ఆదివాసీల సమస్యలన్నీ దాదాపు ఒకేలా ఉన్నాయని గుర్తించింది. దీంతో ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని యూఎన్‌వో ప్రకటించింది.

విభిన్నం-వైవిధ్యం..

సంప్రదాయ ఆచార వ్యవహారాల్లో ఎంతో వైవిధ్యం కనబరిచే గిరిజనులు అటవీ సంస్కృతికి ప్రతీకలు. ఘన చరిత్రకు వారసులు. వారి ఆధ్యాత్మిక చింతన వినూత్నం.వారి కట్టూ బొట్టూ చూడ ముచ్చటగా ఉంటాయి. తెల్లారితే కొండపోడు వ్యవసాయం, అటవీఉత్పత్తుల సేకరణతోనే వారి జీవనం సాగుతుంది. ప్రతి మూడు నెలలకు ఒక్కో అటవీ ఉత్పత్తుల సీజన్ ఆరంభమవుతుంది. పైనాపిల్, సీతాఫలం, పసుపు, జీడి, కందులు, నిమ్మ, బత్తాయి, పెండలం ఇలా అటవీ ఉత్పత్తులతోనే వారి జీవనం ముడిపడి ఉంది. వారం వారం జరిగే వారపు సంతలకు వెళ్లి వారి ఉత్పత్తులు విక్రయించి వారానికి సరిపడా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుంటారు.

కొండపోడే ఆధారం..

పోడు వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా కుటుంబాలతో ఆనందంగా జీవిస్తారు. భూ ఉపరితలానికి అత్యంత ఎత్తైన భాగంలో గూడల్లో నివసిస్తూ భయమంటే తెలియదన్నట్లు క్రూరమృగాల నడుమ, విష సర్పాల పడగ నీడలో సాహస జీవితం గడుపుతుంటారు. జిల్లాలోని అటవీ ప్రాంతమంతా ప్రకృతి సోయగాలతో అలరారుతుంది.

అక్షరాలే ఆరాధ్యదేవతలు-లిపివారిప్రాణం..

శ్రీకాకుళం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మరో వైవిధ్యముంది. ఇక్కడ అక్షరాలను ఆరాధ్యదేవతలుగా గిరిజనులు పూజిస్తారు. ఏ దేవతకైనా పూజలు చేసినా నైవేద్యంగా సారా పెట్టి పూజ అనంతరం పూటుగా తాగుతారు. జీలుగు సారా వంటివి చెట్టునుంచి దించితే ముందుగా తెడ్డులతో సేవిస్తారు. వారి పండగలు, సంప్రదాయాలను బొమ్మల రూపంలో వేయడంలో వారికి వీరేసాటి. ఏజెన్సీలో అక్షరబ్రహ్మ, మడిబ్రహ్మ వంటి ఆలయాలు వెలిశాయి. అక్కడి గిరిజనులు ప్రతి గురువారం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఆగం పండగ వంటివి చేస్తుంటారు. సవర లిపి ద్వారా కొంతమంది ఆదిమ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వారు వేసే లిపికి మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇటీవల కాలంలో దీనిని అభివృద్ధి చేస్తున్నారు.

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 819 కిలోమీటర్ల మేర ఏజెన్సీ విస్తరించి ఉంది. 42 వేల 246 గిరిజన కుటుంబాల్లో 2లక్షల 62వేల మంది కుటుంబ సభ్యులున్నారు. మొత్తం 1187 గిరిజన గూడలుండగా వాటిలో ఆదిమ గిరిజనులు నివసించే గూడలు 467 ఉన్నాయి. గిరిజనుల్లో ప్రధానంగా కొండ సవర, జాతాపు, కాపు సవర తెగలున్నాయి. వివాహాలు, పండగలు, వ్యవసాయం తదితర సందర్భాల్లో ప్రత్యేక పండగలు నిర్వహించుకోవడం ఎంతో వైవిధ్యం. భార్యకు కట్నం ఇచ్చి వివాహం చేసుకునే 'మొగనాలి' ఇప్పటికీ కొన్ని చోట్ల అమల్లో ఉంది.

అభివృద్ధికి ఆమడదూరంలో..

మన్యంలో గిరిజనుల అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. గిరిజనులకు మౌలికవసతులు లేక అల్లాడుతున్నారు. విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు చాలా గ్రామాలకు లేవు. రక్షిత మంచీనీటి వ్యవస్థ అందుబాటులో లేదు. అనాదిగా గిరిజనులు ప్రకృతి ఆధారంగానే జీవన మనుగడ సాగిస్తున్నారు. సుమారు 120కి పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం ఇప్పటికీ లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అంతంతమాత్రంగా వైద్యసేవలు

ఎపిడమిక్ సీజన్‌లో ఏజెన్సీలో మలేరియా విజృంభిస్తుంది. పీహెచ్‌సీల్లో డాక్టర్ల కొరత వేధిస్తోంది. ఇప్పటి వరకు దోమతెరల పంపిణీ లేదు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య సేవల కోసం ఇంతవరకు హెల్త్ వలంటీర్లను నియమించలేదు. పాఠశాలల్లో కనీస మౌలికవసతులైన మరుగుదొడ్లు, అదనపు తరగతుల గదుల సమస్యలు వేధిస్తున్నాయి. గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేవు. అన్ని అటవీ ఉత్పత్తులు జీసీసీ కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ముఖ్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి రేషన్ ఇవ్వడం కోసం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రేషన్ కొండలపైకి మోసుకుని తీసుకువెళ్తూ గిరిజనులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.

రాజాంలో స్థిర పారిశుద్ధ్య వ్యవస్థ

- కేంద్ర జలశక్తి ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్
- రాజాం మండలం యూనిట్‌గా ఎంపిక



రాజాంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావుతో సమీక్షిస్తున్న యూనిట్ ప్రతినిధులు

రాజాం: స్థిరమైన పారిశుద్ధ్య వ్యవస్థ నిర్మాణ దిశగా కేంద్ర జలశక్తి, జీఎంఆర్ ఫౌండేషన్‌లు సంయుక్తగా కృషిచేస్తున్నాయని కేంద్ర జలశక్తి ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ టీం లీడర్ సంజయ్‌కుమార్ పాండే, డిప్యూటీ కన్సల్టెంట్ శృతి మక్కర్ అన్నారు. స్వచ్ఛభారత్ ఫేజ్-2లో భాగంగా పారిశుద్ధ్య వ్యర్థాల నిర్వహణ కోసం కొత్త ప్రమాణాల ద్వారా గ్రామాలను లైట్ హౌస్ ఇనిషియేటివ్‌గా తయారుచేసేందుకు రాజాం మండలాన్ని ఎంపిక చేసినట్టు వెల్లడించారు. ఈ మేరకు రాజాం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజేష్, జేఈ జగన్మోహనరావు తదితరులతో కలిసి గురువారం సంమీక్షించారు. రాజాం మండలంలో పారిశుద్ధ్య పరిస్థితి, వ్యర్థాల నిర్వహణకు అవసరమైన వనరులు, వసతులపై ఆరా తీశారు. అనంతరం స్థానిక విలేకరులతో మట్లాడుతూ మెరుగైన పారిశుద్ధ్యం, పరిశుభ్రత కోసం ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలుచేసేందుకు 15 రాష్ట్రాల్లో 75 గ్రామ పంచాయతీలను కేంద్ర జలశక్తి ఎంపికచేసిందన్నారు. ఇందులో రాజాంకు స్థానం దక్కిందని వెల్లడించారు. జీఎంఆర్ వీఎఫ్‌తో కలిసి రాజాంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. బ్లాక్ స్థాయిలో ఒక స్వచ్ఛసాతీని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ సాయి కిషోర్, హెచ్‌ఆర్‌డీ కన్సల్టెంట్ టి.సుధాకర్, ఎంఆర్‌సీ వైకుంఠరావు, జీఎంఆర్ వీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ముర్రుపాలు అమూల్యం

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న మహిళలు, పాల్గొన్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: బిడ్డ పుట్టిన ఐదు నిమషాల లోపు తల్లి ఇచ్చే ముర్రుపాలు ఎంతో అమూల్యమైనవని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఆ పాలలో అద్భుతమైన పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయని, అవి బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాల గొప్పదనం గురించి నిత్యం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మహిళకు దీని గురించి వివరించాలన్నారు. మహిళలు బిడ్డకు పాలు అందించేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, కలెక్టరేట్‌లలో బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే ఉన్నట్లయితే వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ తల్లి కావడమే గొప్ప అదృష్టమన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే పాలు అందించడం తల్లి బిడ్డలిద్దరికీ శ్రేయస్కరమన్నారు. ఆ తర్వాత గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ 5వ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ శాంతికుమారి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ హిమబిందు, ఐసీడీఎస్ పీడీ విమలారాణి, డీఎల్ఓ డాక్టర్ రాణి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి అన్నపూర్ణ, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతి శ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, నేచర్ సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజ్, ఘోషా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ కలకలం

- సబ్‌రిజిస్ట్రార్‌ను ప్రశ్నించిన రైతు



తనకున్న డాక్యుమెంట్లు చూపించి సబ్‌రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న రైతు ముకుందరావు

భోగాపురం: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్‌పై కలకలం రేగింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గూడెపువలసకు చెందిన రైతు ఆళ్ల ముకుందరావు తాతయ్య పేరు మీద ఉన్న 2.49 ఎకరాల భూమిని, వారసత్వ ఆస్తిగా కుమారుడైన శంకాబత్తుల అప్పల గురువుకు వచ్చింది. ఆయన మృతి చెంది మూడేళ్లు అయినప్పటికీ.. బతికున్నట్లు బినామీ డాక్యుమెంట్లు సృష్టించి ఆ భూమిని ఇద్దరి పేరుమీద అన్‌లైన్ చేసేశారు. ఎలాంటి వన్‌బీ, గానీ, ఈసీ గాని చూడకుండా ఎక్కడో సృష్టించిన డాక్యుమెంట్ల ఆధారంగా తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. దీనిపై భూహక్కుదారుడైన ఆళ్ల ముకుందరావు తనకు చెందాల్సిన భూమికి సంబంధించి రిజిస్ట్రార్ దగ్గరికి వెళ్లి జరిగిదంతా చెప్పడంతో రిజిస్ట్రార్ ఒక్కసారిగా కంగుతిన్నారు. ఈ విషయం బయట పెట్టొద్దని దీనిపై పరిశీలిస్తానన్నారంటూ రిజిస్ట్రార్‌పై ముకుందరావు ఆగ్రహం వ్యక్తం చేశాడు. సర్వే నంబర్ 159-2లో ఎకరం భూమి అరం జ్యోతి పేరు మీద ఉండగా మళ్లీ అదే సర్వే నంబర్ మీద 2.49 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించేశారు. తనకు సంబంధించిన ఆస్తులను ఎలా తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తారంటూ ముకుందరావు ప్రశ్నించాడు. డబ్బులకు అమ్ముడుపోయి ఇలా చేయాడం మీకు తగదని న్యాయం జరిగే వరకు విడిచి పెట్టనని అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానం టూ హెచ్చరించాడు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ముకుందరావు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమణమ్మ ఆయనకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

10న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, కార్యదర్శి జి.లక్ష్మణరావులు గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి ఎల్‌కోట మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ ప్రాంగణంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియ ర్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో పాల్గొనే క్రీ డాకారులు 2010 జనవరి 2వ తేదీ అనంతరం, జూని యర్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 2వ తేదీ అనంతరం జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొన బోయే క్రీడాకారులు వి ధిగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ ,స్టడీ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్లలోకి అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో ప్ర కాశం, అనంతపురం జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పే ర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 90524 57201, 95818 86936 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జిల్లా ఆస్పత్రిలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్

పార్వతీపురం టౌన్: మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్-రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రిలో మెగా ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి జి.నాగభూషణ రావు మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రి, పార్వతీపురం మెడికల్ సూపరింటెండెంట్ డా.వై.నాగశివ జ్యోతి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న సుమారు 176 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 65 మందికి ఓరల్ కేన్సర్ స్క్రీనింగ్ చేశారు. వారిలో 4 అనుమానిత కేసులుగా, 1 నాలుకకు సంబంధించిన కేన్సర్‌గా నిర్ధారణ చేశారు. బ్రెస్ట్ కేన్సర్ పరీక్షలను 91 మందికి నిర్వహించి వారిలో 20 మందిని అనుమనితులుగా గుర్తించి డిజిటల్ మెమోగ్రఫీ పరీక్ష చేశారు. దీని ద్వారా వారిలో ఎవరికీ కేన్సర్ లేదని నిర్ధారించారు. 20 మందికి గర్భసంచి ముఖద్వారం కేన్సర్ పరీక్షలు నిర్వహించి వారిలో 10 మందిని అనుమానితులుగా గుర్తించి పరీక్షలు చేశారు. వాటి రిపోర్టులను వారం రోజులలో అందించనున్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- రహదారులపై అక్రమణలు తొలగించాలి
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రహదారులపై అక్రమణలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం గురువారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రహదారిపై ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యలు తీసుకోవడమే కాకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. రహదారులు, జంక్షన్‌లు, బ్లాక్ స్పాట్స్, పాఠశాలల వద్ద ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఐఆర్ఏడీ యాప్‌లో రోడ్డు ప్రమాద వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఐఆర్ఏడీ యాప్‌పై అన్ని శాఖల అవగాహన కోసం జూమ్ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. రోడ్లు భవనాలు, పోలీసు, రవాణా, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త బృందాలు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత సమావేశం నుంచి ఇప్పటివరకు పెండింగ్ ఉన్న కేసులను తక్షణమే క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సౌమ్యలత, రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.కాంతిమతి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, విజయనగరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, ఎంవీఐ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలందక వ్యక్తి మృతి



ధనుంజయ మృతదేహం



ధనుంజయ (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట పరిధిలో బుధవారం ప్రమాదవశాత్తు కింద పడిపోయిన వ్యక్తికి సకాలంలో సహాయక చర్యలందకపోవడంతో మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నాయుడువలస పంచాయతీ మధుర గ్రామం కొండపాలవలసకు చెందిన లెంక ధనుంజయ(33)ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. రోజులాగానే బుధవారం కూడా ట్రాక్టర్ తోలడానికి వెళ్లిపోయి అదే మండలం ఆరికతోట గ్రామ పొలంలో మొక్కజొన్న కంకులు రెండు లోడులు పెరిగాడు. మూడో లోడుకు వెళ్లకుండా పొలంలో ట్రాక్టర్ వదిలేసి చెట్ల నీడకు వెళ్దామన్న ఉద్దేశంతో అక్కడికి కొద్ది దూరంలో ఉన్న నీలగిరి తోటలోకి వెళ్తుండగా తోటలో గతంలో నరికిన చెట్ల మొదళ్లు తన్నుకుని కంకర రోడ్డులో బోర్లా పడిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పాటు ఎండవేడిమి ఎక్కువగా ఉండడంతో వెంటనే సహాయక చర్యలందక మృతిచెందాడు. బుధవారం రాత్రికి కూడా ధనుంజయ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. మద్యం తాగే అలవాటు ఉన్నోడు కదా ఏదో టైమ్‌లో ఇంటికి వచ్చేస్తాడులే అన్న ఉద్దేశంతో అలా వదిలేశారు. ట్రాక్టర్ ఓనర్ కూడా వెతికి తన ట్రాక్టర్‌ను తీసుకెళ్లిపోయాడు. గురువారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ట్రాక్టర్ వదిలేసిన పరిసరాల్లో మళ్లీ వెతికారు. అయినా కనిపించకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోతున్న సమయంలో ఆరికతోట గ్రామానికి చెందిన ఓ రైతు గడ్డిమోపు పట్టుకుని కనిపించి నీలగిరి తోటలో ఎవరో పడి ఉన్నారని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి అప్పటికే మృతిచెంది ఉన్న ధనంజయను చూసి అవాక్కయ్యారు. బోర్లా పడి ఉన్న మృతదేహం ముఖంపై రక్తం మరకలు ఉండడం చూసి ఎలా మృతి చెంది ఉంటాడు? ఎవరైనా చంపి పడేశారా? మృతుడికి ఎవరూ శత్రువులు లేరే అని అలోచించి అనుమానాస్పద మృతిగా భావించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై వి. ప్రసాదరావు సిబ్బందితో కలిసి ఘటనా చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి సాధారణ మృతా? లేక హత్యా? అని పరిశీలించి సాధారణ మృతిగా నిర్ధారించారు.కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య గౌరీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గౌరీశ్వరి, పాప, బాబు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శివకుమార్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సీతంపేట: స్థానిక సొండివీధికి చెందిన నల్లా శివకుమార్ (34) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఒడిశాలోని గజపతి జిల్లా రసూరుకు చెందిన జ్యోతితో ఏడాది కిందట శివకుమార్‌కు వివాహం జరిగింది. తల్లిదండ్రులు వెంకట్, విజయలక్ష్మితో పాటు శివకుమార్, భార్య జ్యోతి ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. ఫాస్ట్‌ఫుడ్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వారింట్లో ఇటీవల కుటుంబ తగాదాలు ఎక్కువవడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా ఇంటికి వచ్చి చూసిన తండ్రి వెంకటరావు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి ఆటోలో తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు.

పురుగు మందు తాగి వ్యక్తి..



ఎండ చిరంజీవి మృతదేహం

గజపతినగరం రూరల్: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండ.చిరంజీవి పురుగు మందు తాగి జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ మృతుడి తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు. చిరంజీవి నిత్యం మద్యం తాగుతూ తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవాడన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రాగా భార్యతో గొడవ పడడంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగు మందును తాగేశాడు. స్థానికుల సాయంతో కుటుంబసభ్యులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.